ప్రజాశక్తి
బుధవారం 18 సెప్టెంబర్ 2024 8 పేజీలు






గుంటూరు పల్నాడు

పల్నాడులో సాగు పాక్షికం

60 శాతం విస్తీర్ణంలోనే పైర్లు - ఆలస్యంగా వరి నాట్లు-పూర్తవ్వని మిర్చి - పొగాకుపై రైతుల ఆసక్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



పల్నాడు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు తీవ్ర జాప్యమవుతోంది. ఈ జిల్లాలో మొత్తం 6.60 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉండగా ఇప్పటి వరకు 3.80 లక్షల ఎకరాలే సాగైంది. వర్షాలు ఆశాజనకంగా ఉండటం, కాల్వలకు పూర్తి స్థాయిలో నీరు వస్తున్నా ఇప్పటికీ ఖరీఫ్ సాగు పూర్తవ్వలేదు. 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా ఉండగా ఇప్పటి వరకు 65 వేల ఎకరాల్లోనే వరి నాట్లు వేశారు. ఆలస్యంగా సాగు చేయడం వల్ల ఎక్కువ మంది నాట్లు పద్ధతికి సుముఖత వ్యక్తం చేశారు. 50 వేల ఎకరాల్లో కంది సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 38 వేల ఎకరాల్లో వేశారు. 2.65 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా ఉండగా 1.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. దాదాపు 1.20 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తారని భావిస్తుండగా ఇప్పటి వరకు 60 వేల ఎకరాల్లోనే సాగు చేశారు. ఇతర పంటలు మరో 60 వేల ఎకరాలల్లో సాగు చేశారు. పత్తి, మిర్చి తరువాత కంది, మినుము, పెసర, జూట్, పొగాకు, సొయాబిన్ పంటలను అధికంగా సాగు చేశారు.

ఈ ఏడాది రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడం, బ్యాంకుల నుంచి రుణాలు ఇవ్వకపోవడం తదితర కారణాల వల్ల కొంతమేరకు మందగమనం ఉన్నా వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి కూడా సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఇటీవల అధిక వర్షాల వల్ల 30 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. వరి, పత్తి, మిర్చి కంటే ఈ ఏడాది ఇతర పంటల వైపు రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పొగాకు, సోయాబిన్, అపరాల సాగు చేయడమే మేలనే భావనలో ఉన్నారు. మిర్చి సాగు వల్ల గతేడాది ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది పొగాకు సాగుకు ఎక్కువ మందిరైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రధానంగా పొగాకు అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు గణనీయంగా పెరగడం వల్ల సాగర్ ఆయకట్టు పరిధిలోని ప్రత్తిపాడు, చిలకలూరిపేట, నర్సరావుపేట, తాడికొండ తదితర నియోజకవర్గాల్లోని దాదాపు 30 గ్రామాల రైతులు పొగాకు సాగుకు సన్నద్ధం అయ్యారని తెలిసింది.

సాగర్ ఆయకట్టులో వరికి ఈ ఏడాది అనుమతి ఇచ్చినా ఇంకా పూర్తి స్థాయిలో నాట్లు పూర్తి చేయడంలో జాప్యమవుతోంది. రైతులు వరి సాగుపై ఇప్పటి వరకు ఆచితూచి వ్యవహరించారు. గత రెండేళ్లుగా వరి సాగుకు అనుమతి ఇవ్వకపోవడం వల్ల ఈ ఏడాది వరి సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని, పంట మార్పిడి కూడా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు వరకు సాగుకు సమయం ఉందని పెండింగ్‌లో ఉన్న వరి నాట్లు, మిర్చి సాగు రాబోయే పక్షం రోజుల్లో పూర్తి కావచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు దాచేపల్లి, మాచవరం, అమరావతి, క్రోసూరు, అచ్చంపేట మండలాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు సేకరించి ఈనెల 10వ తేదీన నివేదిక ప్రభుత్వానికి పంపారు.

టిడిపి కార్యాలయంపై దాడి కేసులో110 మంది గుర్తింపు

అరెస్టు నుండి మినహాయింపు ఉత్తర్వులున్నా విచారణకు పిలుస్తాం : ఎస్పీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంపై రెండేళ్ల క్రితం జరిగిన దాడిలో ఇప్పటి వరకు 110 మంది నిందితులను గుర్తించినట్టు జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. గుంటూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు 32 మందిని అరెస్టు చేయగా.. తమను అరెస్టు చేయవద్దంటూ 59 మంది కోర్టుకెళ్లి ఉత్తర్వులు తెచ్చుకున్నారని చెప్పారు. ఇటీవల నలుగురు నేతలకు సుప్రీంకోర్టులో మూడు వారాల పాటు అరెస్టు కాకుండా స్టే తెచ్చుకున్నారని తెలిపారు. కోర్టు నుంచి అరెస్టు మినహాయింపు ఉత్తర్వులు తెచ్చుకున్నా విచారణకు పిలుస్తామన్నారు. మాజీ ఎంపి నందిగం సురేష్‌ను వివిధ అంశాలపై ప్రశ్నించగా ఆయన అన్ని వివరాలు చెప్పారన్నారు. చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో 23 మందిపై కేసు నమోదైందని, 9 మంది ఇప్పటి వరకు అరెస్టయ్యారని తెలిపారు. మాజీ మంత్రి జోగి రమేష్ కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారని తెలిపారు. నర్సాపురం మాజీ ఎంపి రఘురాం కృష్ణంరాజుపై దాడి కేసుల్లో దర్యాప్తు జరుగుతోందని, ఈ కేసులో మాజీ డిఎస్‌పి విజయపాల్ కోర్టు నుంచి ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేయగా తాము కౌంటర్ దాఖలు చేశామని ఎస్పీ తెలిపారు.

రాజధాని అమరావతికి భూములివ్వడానికి సిద్ధం

ఎపి సిఆర్‌డిఎ కమిషనర్‌ను కలిసిన రైతు నాయకులు

ప్రజాశక్తి - విజయవాడ

రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం అభివద్ధి పరచే వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూమిని భూ సమీకరణ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివద్ధి ప్రాధికార సంస్థ (ఎపిడిఆర్‌డిఎ)కు ఇచ్చేందుకు తాము సుముఖంగా ఉన్నట్లు పలువురు రైతులు వెల్లడించారు. విజయవాడలోని ఎపిసిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో సంస్థ కమిషనర్ కాటంనేని భాస్కర్‌ను మంగళవారం మల్లెల శేషగిరిరావుతో కలిసి ఉండవల్లి, పెనుమాక, అనంతవరం, మల్కాపురం గ్రామాలకు చెందిన రైతులు కలిసి తమ భూములను భూ సమీకరణ పథకానికి ఇచ్చే విషయమై చర్చించారు. గతంలో ఎదుర్కొన్న చిన్న చిన్న సమస్యలు పరిష్కరిస్తే మరింత మంది ముందుకొస్తారని తెలిపారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ప్రతి శుక్రవారం అదనపు కమిషనర్ తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, రాజధాని అన్ని గ్రామాల్లో రైతులతో సమావేశమై వారి వ్యక్తిగత సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎపి సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్, ల్యాండ్స్ డైరెక్టర్ బి.ఎల్.ఎస్.రాజకుమారి పాల్గొన్నారు.



మొక్కజొన్న లోడు మాటున గోవా మద్యం

రూ.6.59 లక్షల సరుకును స్వాధీనం చేసుకున్న పోలీసులు - ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గోవా నుండి మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా నాగార్జున సాగర్ అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఈ మేరకు వివరాలను విజయపురిసౌత్ మాచర్ల రూరల్ సిఐ షేక్ నతీజ్‌బాష, ఎస్ఐ షేక్.మొహమ్మద్ షఫీ మంగళవారం వెల్లడించారు. గుంటూరుకు చెందిన కలసాని లక్ష్మారెడ్డి, మాచర్ల పట్టణానికి చెందిన బొందల సత్యనారాయణ గోవాకు వెళ్లి పలు దుకాణాల్లో వివిధ రకాల మద్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేశారు. ఆ సీసా కేసులను ఒక వాహనంలో వేసుకుని, వాటిపై మొక్కజొన్న బస్తాలను వేసి ఈనెల 15న గోవా నుండి తిరుగు పయనమయ్యారు. తెలంగాణ మీదుగా మంగళవారం నాగార్జున సాగర్ చెక్‌పోస్ట్ వద్దకు రాగానే పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టి మద్యాన్ని గుర్తించారు. 1236 ఫుల్ బాటిల్స్, 72 టిన్ను బీర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.6.59 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు సోమయ్య, సోమ్లా నాయక్, కానిస్టేబుళ్ల సురేష్, గోపి, శ్రీనివాసరావు, శివాజీ, సుభాని పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ ఆధునీకరణకు మళ్లీ ప్రతిపాదనలు

సవరించిన అంచనాలతో వారంలోపు నివేదించాలని కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు



సమీక్షలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నరేంద్రకుమార్, అధికారులు

గుంటూరు ఛానెల్ ఆధునీకరణకు సంబంధించి సవరించిన అంచనాలతో ఒక వారంలోపు ప్రతిపాదనలు పంపాలని జలవనరుల శాఖాధికారులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి జలవనరుల శాఖాధికారులతో సమీక్షించారు. గుంటూరు ఛానెల్ ఆధునీకరణ, పొడిగింపు, గుంటూరు నల్లా, నల్లమడ వాగు ఆధునీకరణకు సంబంధించి భూసేకరణ పనుల అంశాలపై చర్చించారు. గుంటూరు నాలా ద్వారా మురుగు నీరు ప్రవహించి పొన్నూరు నియోజకవర్గానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలుపుతూ ఇందుకు సంబంధించి ఆధునీకరణకు సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి, సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ కోరారు. గుంటూరు ఛానెల్ పొడిగింపు 47 కిలోమీటర్ల నుండి 74.065 కిలోమీటర్ల వరకూ పొడిగింపు పనుల నిమిత్తం భూ సేకరణకు సంబంధించిన వివరాలను, అందుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ చెప్పారు. బచావత్ ట్రిబ్యునల్ గుంటూరు చానెల్‌కు కేటాయించిన నాలుగు టీఎంసీల నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవటానికి అవసరమైన పనులన్నింటినీ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని పొన్నూరు ఎమ్మెల్యే కోరారు. నల్లమడ వాగు ఆధునికీకరణకు సంబంధించి భూసేకరణ, ఫేజ్-2 కింద పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. గుంటూరు ఛానెల్ పొడిగింపునకు సంబంధించి భూసేకరణకు రూ.110 కోట్ల ప్రాథమిక నిధులకు, ఛానెల్ ఆధునికీకరణ, పొడిగింపు ప్రతిపాదనల నిమిత్తం డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేసి అందించాలని జలవనరుల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఉమామహేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.కె.వి. ప్రసాద్, డిఇ శివశంకర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి ఓఎస్డి రూప్‌కుమార్, కృష్ణమ నాయుడు, రాష్ట్ర మానవ వనరుల శాఖ అదనపు పిఎస్ హరగోపాల్, చీరాల, రేపల్లె మురుగు నీటి విభాగం ఈఈ బి.మురళికృష్ణ, వెంకటరత్నం పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ

యోగా పోటీల్లో 'తిరుమల' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నరసరావుపేట పట్టణంలోని శ్రీకృష్ణచైతన్య విద్యా సంస్థల్లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని తిరుమల ఇంజినీరిర్ కాలేజీ ప్రిన్సిపాల్ వైవి నారాయణ తెలిపారు. ఈ పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా తమ కళాశాల విద్యార్థులు పి.ఏసు మరియమ్మ, టి.కపిల్ ప్రథమ స్థానం సాధించారని, ఎం.వంశీకృష్ణ ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా జొన్నగడ్డ గ్రామ పరిధిలో గల తిరుమల కళాశాలలో విద్యార్థుల అభినందన సభ మంగళవారం నిర్వహించారు. విద్యార్థులతోపాటు యోగా శిక్షకులు రంగలక్ష్మిని ప్రిన్సిపల్, కళాశాల యాజమాన్యం అభినందించింది. యోగా మానసిక ఒత్తిడి తగ్గించడంతో పాటు మనసుకు ఉత్తేజం, ప్రశాంతతను కలిగిస్తుందని ప్రిన్సిపాల్ అన్నారు.

తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారమూ ఇవ్వాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పోషకాహార వారోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలోని కుమ్మరపాలెం, తూర్పుపాలెం అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం అవగాహన కల్పించారు. సిడిపిఒ సుజాతదేవి మాట్లాడుతూ పిల్లలకు 6వ నెల దాటినప్పటి నుండి తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం కూడా ఇవ్వాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతం, అందులోని పోషకాలను వివరించారు. ఎసిడిపిఒ విజయ నిర్మల, సూపర్వైజర్ భారతి, అంగన్వాడీ కార్యకర్తలు ఎ.వెంకాయమ్మ, డి.కనకమ్మ, బాలింతలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.



అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని అన్ని గ్రామాల్లో తల్లిపేరుతో మొక్క కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఉపాధి హామీ ఇన్ఛార్జి ఎపిఒ వలి మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు అందరూ తోడ్పడాలని కోరారు.

పిఎంఎవై గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి - వినుకొండ



పట్టణంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించిన ఇళ్ల గృహ ప్రవేశం మంగళవారం నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ ఎడి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, టిడిపి నాయకులు ఆయుబ్ ఖాన్, షమీంఖాన్, పి.పూర్ణచంద్రరావు, సౌదాగర్ జానీబాష, పీవీ సురేష్, అజీజ్, జి.సుబ్బారావు, నాసరయ్య, ఐ.ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

మా కాలేజీ స్థలం కబ్జా

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని కొందరు ఆక్రమించి రోడ్డు వేస్తున్నారని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేసి తహశీల్దార్కు వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని కాలేజీ ప్రిన్సిపాల్కు చెప్పగా ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారని, అయినా పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా స్పందించి కాలేజీ భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో దత్తసాయి నాయక్, అమర్, గోపీచంద్, మంజు, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



విశాఖ ఉక్కు కోసం ఎంపీ పదవికి కొల్లా వెంకయ్య రాజీనామా

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు - నూతన లైబ్రెరీ, కంప్యూటర్ హాలు ప్రారంభం





నూతన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న గీతా రామస్వామి , కంప్యూటర్ హాలు ప్రారంభిస్తున్న లావు రత్తయ్య

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమంపై ప్రభుత్వ ధమనకాండకు నిరసనగా పార్లమెంటు సభ్యత్వానికి తృణ ప్రాయంగా రాజీనామా చేసిన మొదటి పార్లమెంటు సభ్యుడు కొల్లా వెంకయ్య 26వ వర్ధంతిని మండల కేంద్రమైన పెదనందిపాడులో మంగళవారం నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్లోని కొల్లా వెంకయ్య విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం కామ్రేడ్ కొల్లా వెంకయ్య లైబ్రరీ నూతన భవనాన్ని హైదరాబాద్ బుక్ ట్రస్ట్ రచయిత సామాజిక కార్యకర్త, గీతా రామస్వామి, కొల్లా వీరమ్మ కంప్యూటర్ హాలును విజ్ఞాన్ సంస్థల అధినేతడాక్టర్ లావు రత్తయ్య ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్ అడ్వకేట్ కొల్లా రాహుల్ సాంకృత్యాయన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో గీతా రామస్వామి మాట్లాడుతూ నల్లమడ రైతుసంఘాన్ని స్థాపించి రైతులతో పాటు ఈ ప్రాంత బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కొల్లా వెంకయ్య కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. డాక్టర్ కొల్లా రాజమోహనరావు రైతు సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై పోరాడుతున్నారన్నారు. యువత పెడదారులు పట్టకుండా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సమాన హక్కులు కోసం పోరాటం చేసే నైజం నిజమైన కమ్యూనిజమన్నారు. తనకు చిన్నతనం నుండి కొల్లా వెంకయ్యతో సంబంధాలు ఉండేవని, ఆయన మాటలు తనకు స్ఫూర్తినిచ్చాయని చెప్పారు. ప్రజల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని, గ్రంథాలయ అభివృద్ధికి తన సహకారాన్ని అందిస్తానని చెప్పారు. గుంటూరు ఛానల్ పొడిగింపు పని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ప్రాజెక్టుగా గుర్తింపు తెస్తే పనులు తేలిగ్గా అవుతాయని సూచించారు. తన కుమారుడు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సహకారమందేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కొల్లా వెంకయ్య కుటుంబ సభ్యులతోపాటు వివిధ పార్టీల నాయకులు, పలు ప్రాంతాల నుండి వెంకయ్య అభిమానులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ పనులపై కదలిక



మ్యాప్ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇటీవల వర్షాలకు గుంటూరు జిల్లాలో దెబ్బతిన్న పంట పొలాలు, గండిపడ్డ డ్రెయిన్లు, వాగులు, గుంటూరు ఛానల్ పరివాహక ప్రాంతాలపై కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టి సారించారు. మరోసారి ఇలాంటి వరద నష్టం జరగకుండా అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. రూ.808 కోట్ల ప్రతిపాదనలతో కూడిన అంచనాలతో గుంటూరు ఛానల్ అభివృద్ధికి గాను చేపట్టాల్సిన పనులపై ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేక అధికారిని గుంటూరుకు పంపారు. డ్రెయిన్ల ఆధునీకీకరణకు త్వరలో డిపిఆర్ తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలోని గుంటూరు ఛానల్, బుడంపాడు, పీకల వాగు, గుంటూరు నల్లా డ్రెయిన్, అనంతవరప్పాడు, 0 - 75 కిలోమీటర్ల పరిధిలోని కృష్ణా పశ్చిమ డెల్టా బేసిన్లోని కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టాలని మంత్రి దృష్టికి అధికారులు తీసుకువెళ్లగా ఇందులో భాగంగా ఢిల్లీ నుంచి ప్రత్యేక అధికారిగా కెఆర్ఎస్ కృష్ణమ నాయుడు మంగళవారం గుంటూరుకు పంపారు. కాగా ఆయా ప్రాంతాలలో ఆయన పర్యటించారు.

గుంటూరు నల్లాలో కలుస్తున్న పీకల వాగు డ్రెయిన్, గుంటూరు నుంచి విడుదలవుతున్న మురుగునీరు పీకల వాగు గుండా గుంటూరు నల్లా డ్రెయిన్ లో కలుస్తున్న పలు ప్రాంతాలను స్పెషల్ ఆఫీసర్ పరిశీలించారు. అనంతవరప్పాడు, గారపాడు, బుడంపాడు తదితర ప్రాంతాల్లో పర్యటించిన క్రమంలో నష్టపోయిన రైతులతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేలు నరేంద్రకుమార్, రామాంజనేయులుతో చర్చించారు.



హెచ్ఐవి, ఎయిడ్స్పై కథల పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు మినీ కథల పోటీ (తెలుగు) నిర్వహిస్తున్నట్లు మారుతి మహిళా సొసైటీ డైరెక్టర్ లక్కంరాజు సునీత తెలిపారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే రచయితలు ఎ4 సైజ్ రెండు పేజీలకు మించకుండా రాసిన కథను తమ చిరునామా, ఫోన్ నెంబర్ తెలుపుతూ అక్టోబర్ 30లోపు లక్కంరాజు సునీత, డైరెక్టర్ మారుతి మహిళా సొసైటీ, నులకపేట, ప్రెస్క్లబ్ వద్ద తాడేపల్లి, గుంటూరు జిల్లాకు పంపాలని కోరారు. ఫలితాలు నవంబర్ 23న ప్రకటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ గంగాభవానీ, ప్రత్యూష పాల్గొన్నారు.

రెండు పళ్ల విభాగంలో ఉత్సాహంగా ఎండ్ల పందేలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



స్థానికంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన రెండోరోజైన మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. రెండు పళ్ల విభాగంలో 10 జతలు పాల్గొనగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురానికి చెందిన నల్లబోతు ప్రవీణ్ కుమార్కు చెందిన ఎడ్ల జత 3600 అడుగులు దూరాన్ని, తెలంగాణ రాష్ట్రం హుజూర్ నగర్కు చెందిన ములకలపల్లి సురేష్ సంధ్య ఎడ్ల జత 3600 అడుగులతో సమాన దూరాన్ని లాగడంతో వీరికి సమానంగా మొదటి రెండు బహుమతులను అందించారు. రేపల్లెకు చెందిన బోయిన నాగరాజు ఎడ్లజత 3229 అడుగులతో మూడో స్థానం, నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం రామకృష్ణాపురానికి చెందిన కె.నాగేంద్ర ఎడ్ల జత 3113 అడుగులతో నాలుగో స్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లజత 3073 అడుగులతో ఐదో స్థానాన్ని సాధించాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడుకు చెందిన మోపర్తి నవీన్ కుమార్ ఎడ్లజత 3028 అడుగులతో ఆరవ బహుమతి, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఎర్రబాలేనికి చెందిన ఎపురి శ్రీనివాసరావు ఎడ్లజత 2799 అడుగులతో వ7వ బహుమతి, బాపట్ల జిల్లా పర్చూరు మండలం గొల్లపూడికి చెందిన కొమ్మనబోయిన పథ్వి కుమార్ యాదవ్ ఎడ్లజత 2799 అడుగులతో ఏడో బహుమతిని సమానంగా సాధించాయి. బాపట్ల జిల్లా కర్లపాలేనికి చెందిన చరణ్యారెడ్డి ఎడ్లజత 2692 అడుగులతో ఎనిమిదవ బహుమతి పొందారు. పోటీలను చూడ్డానికి ఎమ్మెల్యే బి.రామంజనేయులుతో పలువురు నాయకులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు.


వావిలాలకు ఘన నివాళి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకష్ణయ్య 80 సంవత్సరాల ప్రజా జీవితంలో నిజాయితీ, నిబద్ధత, నిస్వార్థ సేవతో దేశానికి ఆదర్శనేతగా మిగిలారని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కొనియాడారు. మంగళవారం వావిలాల గోపాలకృష్ణయ్య 118వ జయంతి జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో ఘనంగా నిర్వహించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి సభకు అధ్యక్షత వహించారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ వావిలాల గోపాలకష్ణయ్య మహాత్మా గాంధీ అడుగుజాడల్లో పయనిస్తూ ఆంధ్రా గాంధీగా ప్రజల మన్ననలు పొందిన మహనీయులన్నారు. నేటి నేతలు వావిలాల జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పయనించాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ వావిలాల గోపాలకష్ణయ్యతో కలిసి సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమం, మధ్య వ్యతిరేక ఉద్యమాలలో పాలుపంచుకున్నట్టు తెలిపారు. వావిలాల స్వతంత్ర అభ్యర్థిగా కమ్యూనిస్టుల మద్దతుతో నాలుగు పర్యాయాలు సత్తెనపల్లి నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా గెలవడం, 1952 మరియు 1955లో గెలిచినప్పుడు కేవలం రూ.రెండు వేలు మాత్రమే ఖర్చు కావడం వావిలాల నిస్వార్థత్వానికి గుర్తింపు అన్నారు. వావిలాల గోపాలకష్ణయ్య మనువడు మన్నవ సోడేకర్ మాట్లాడుతూ వావిలాల నిరంతరం అధ్యయనశీలి అని, దాదాపు 6000 గ్రంథాలతో తన ఇంటిని గ్రంథాలయంగా మార్చారని తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు , డాక్టర్ వెలుగోరి సుబ్బారాయుడు, గోడవల్లి నాగేశ్వరరావు, కొరివి వినయ్ కుమార్, టి. ధనుంజయ రెడ్డి, సిరిపురపు శ్రీధర్, జాస్తి వీరాంజనేయులు, సుజాత, అవధానుల హరి,కొండా శివరామిరెడ్డి, భువనగిరి శ్రీ కృష్ణవేణి ప్రసంగించారు. తొలుత వావిలాల కుటుంబ సభ్యులతో కలిసి వావిలాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి -సత్తెనపల్లి టౌన్ : స్వాతంత్ర సమర యోధుడు, మాజీ శాసన సభ్యులు పద్మ భూషణ్ అవార్డు గ్రహీత వావిలాల గోపాలకృష్ణయ్య 118 వ జయంతిని స్థానిక వావిలాల స్మృతి వనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు వావిలాల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో తనవంతు కృషి చేసి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయదుంధుభీ మోగించి ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారన్నారు. సారా వ్యతిరేక ఉద్యామానికి తుదివరకు కృషిచేసిన ఘనత వావిలాలకే సొంతం అన్నారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సంగం డెయిరీ విరాళం రూ.50 లక్షలు

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి :వరద బాధితుల సహాయార్థం, సంగం డెయిరీ పాలకవర్గం నిర్ణయం మేరకు డెయిరీ నిధుల నుండి రూ. 50 లక్షల విరాళాన్ని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మంగళవారం వెలగపూడి సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడికి అందించారు. డెయిరీ పాలక వర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నులిపురుల నివారణ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు :నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక స్తంభాల గరువులోని చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య నగరపాలక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి , జిల్లా విద్యాశాఖ అధికారి శైలజ ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 19 సంవత్సరాల లోపు ఉన్న 5,15,820 పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాలు ప్రాథమిక ఉన్నత పాఠశాలలు , కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్‌బాబు, ఎంఇఒ ఖుద్దూస్, డెమో ఎ.జయ ప్రసాద్, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమం అమలుకు వందరోజుల ప్రణాళిక సిద్ధం చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికకు రూపొందించి అందచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్దేశిత లక్ష్యాలు, పురోగతిపై శాఖల వారీగా వ్యవసాయ, సెరికల్చర్, అటవీశాఖ, కో-ఆపరేటివ్, ఇరిగేషన్, విద్యాశాఖ, టిడ్కో గృహాలు, పంచాయతి రాజ్, రోడ్లు భవనాలు, సంఘీక సంక్షేమ, విద్య, వైద్యం, ఎక్సైజ్ వివిధ శాఖలతో సమీక్షించారు. నియోజకవర్గానికి ఒక రైతుబజారు ఉండేలా స్థలాన్ని సేకరించి రైతు బజార్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని, తగు విధంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ మార్కెటింగ్ శాఖ అధికారికి సూచించారు. కౌలురైతులకు సిసిఆర్ కార్డులు అందచేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ్‌తేజ

నిషేధిత జాబితా నుండి తొలగించిన భూములను పునఃపరిశీలించాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో ఫ్రీ హెూల్డ్ కేటగిరీ ద్వారా నిషేధిత భూముల జాబితా నుండి తొలగించబడిన భూములను ప్రభుత్వ ఆదేశాలు, అమలులో ఉన్న నియమనిబంధనలను అనుసరించి పునఃపరిశీలన చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవతేజ ఏ.భార్గవ్‌తేజ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, సబ్-రిజిస్ట్రార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి ఆయా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. అనంతరం సిఆర్‌డిఎ పరిధిలో ఇంకా భూసేకరణ చేయాల్సిన భూముల వివరాలను సర్వే నెంబర్ వారీగా తయారు చేయాలన్నారు. అమరావతి మీదుగా ఎర్రబాలెం-నంబూరు స్టేషన్లను కలిపే రైల్వే లైన్‌కు సంబంధించి రైల్వే అధికారులు పంపిన ప్రతిపాదనలను పరిశీలించి,అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆర్‌డిఒ, తహశీల్దార్లకు సూచించారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ శైలజ, సబ్ కలెక్టర్ సంజనసింహ, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్, గుంటూరు ఆర్‌డిఓ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధికి విరాళం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్:వరద బాధితుల సహాయార్థం సిఎం సహాయనిధికి వావిలాల కుటుంబం రూ.లక్ష విలువగల చెక్కును సిఎం చంద్రబాబుకు మంగళవారం అందచేశారు. చెక్కుతో పాటు 500మందికి సరిపడా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా వావిలాల సంస్థకు అండగా ఉంటామని, రూరల్ డెవలప్మెంట్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంలో వావిలాల సంస్థకు భాగస్వామ్యం కల్పిస్తామని సిఎం హామీ ఇచ్చారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 47,720
మిర్చి ఎగుమతి	: 43,418
మిర్చి నిల్వ	: 20,492

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 17,000
నెం.5	11,000 - 15,000
273	10,000 - 14,200
341	8,700 - 16,000
4884	14,000 - 16,000
సూపర్ 10	14,000 - 16,000
నాన్ ఎసి	
తేజ	8,000 - 18,600
బడిగి	8,000 - 15,000
దేవనూరు డీలక్స్	9,500 - 15,200
తాలుకాయలు	5,000 - 11,000
ఎసి	
334	9,000 - 15,500
నెం.5	10,500 - 15,000
341	10,000 - 17,000
4884	12,500 - 15,000
తేజ	8,000 - 18,500
బడిగి	10,000 - 14,200
దేవనూరు డీలక్స్	15,500- 15,500
తాలుకాయలు	6,000 - 10,500

ధరలను అదుపు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి : హద్దు అదుపు లేకుండా రోజురోజుకూ పెరిగిపోతున్న ధరలకు సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయని సిపిఎం అమరావతి కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వానలు, వరదలతో ప్రజలు, చిన్న, సన్నకారు రైతాంగం రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు దినదినగండంగా గడుపుతున్నారని, ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను నియంత్రించాలని కోరారు. వరదల కారణంగా నష్టపోయిన రైతులకు సత్వరమే నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

భాధ్యతలు చేపట్టిన డీఎస్పీ హనుమంతరావు



ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్ : సత్తెనపల్లి డీఎస్పీగా ఎం.హనుమంతరావు మంగళవారం భాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జి.గుర్నాథ్‌బాబు డీజీపీ హెడ్ క్వార్టర్‌లో రిపోర్ట్ చేశారు. నూతన డీఎస్పీ హనుమంతరావు గతంలో సత్తెనపల్లి ఎస్ఐ గాను పిడుగురాళ్ల, అమరావతి పోలీసుస్టేషన్‌లలో సిఐ పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్‌లో నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసాంఘిక కార్యకలాకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. డీఎస్పీకి కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు, సిఐలు, ఎస్ఐలు కలిసి శుభాకాంక్షలు చెప్పారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు

వరద బాధితులకు పెన్షనర్ల చేయూత హర్షణీయం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ : వరదల్లో నష్టపోయిన వారిని ఆదుకోవటానికి తమ వంతు చేయూతను అందించామని పెన్షనర్ల అసోసియోషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు అన్నారు. మంగళవారం స్థానిక పెన్షనర్ల హాల్ నందు పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల విజయవాడ నగరాన్ని ముంచెత్తిన వరదల వలన బాధితులైన ప్రజలను ఆదుకోవడానికి ఉద్యోగుల, పెన్షనర్ల జేఏసీ ఒకరోజు వేతనాన్ని ప్రభుత్వానికి అందజేయడాన్ని అసోసియేషన్ కార్యవర్గ సమావేశం హర్షించింది. రామకృష్ణారావు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడం అందరి బాధ్యతన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షుడు నందా నరసింహయ్య మాట్లాడుతూ పెన్షనర్ల కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని తగ్గించి వారికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ కార్యదర్శి డి.ఎస్.నాగేశ్వరరావు, ఈశ్వర య్య, సుబ్బారావు నరసయ్య, పాపిరెడ్డి, చెన్నకేశవులు, అంజ య్య, రామరాజు, జాన్‌సాహెబ్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలపై సమీక్ష

ప్రజాశక్తి-ఈపూరు : స్త్రీ నిధి రుణాలు సుస్థిరమైన జీవనోపాధిని మెరుగుపరచుకోవడానికి ఉపయోగపడతాయని పల్నాడు జిల్లా స్త్రీ నిధి ఎజిఎం ఆర్ చిన బుల్లయ్య అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో శ్రీనిధి రుణబకాయిల వసూళ్లపై సీసీలతో మంగళవారం సమీక్షించారు. మండలంలో 28 గ్రామ సంఘాలు ఉండగా వాటి పరిధిలో 1200 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయని, 16 గ్రామ సంఘాల్లో రూ .39.87 లక్షల స్త్రీ నిధి రుణ బకాయి ఉందని చెప్పారు. జిల్లాలో 24 మండలాల్లో రూ.11 కోట్ల స్త్రీనిధి రుణ బకాయిలు ఉన్నాయని, వసూళ్లకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. మండలానికి రూ.13 కోట్ల రుణాలు మంజూరుకు అవకాశం ఉందని, ప్రస్తుతం రూ.ఐదు కోట్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో రూ.120 కోట్ల రుణాలు మంజూరే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీసీలు హనుమంతరావు, రామారావు, రాజు పాల్గొన్నారు.

శక్తిహీనులుగా మార్చే నులిపురుగులు

నివారణ కోసం డీ వార్మింగ్ డే : పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు వేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బాలలను నులిపురుగులు శక్తి హీనులుగా మారుస్తాయని, అన్నివిధాలా ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తాయని, ఈ నేపథ్యంలో వాటి నివారణే ప్రధాన ధ్యేయంగా డీవార్మింగ్ డేను నిర్వహి స్తున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో డీవార్మింగ్ డేలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 1-19 ఏళ్ల చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. అనివార్య కారణాలతో మొదటి రోజు మాత్రలు అందకపోతే ఈ నెల 20న మళ్లీ పంపిణీ చేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు ఎక్కువగా మట్టిలో ఆడుకోవడం, చేతులు శు భ్రం చేసుకోకపోవడంతో నులి పురుగులు శరీరంలోకి ప్రవేశించి ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. 50 శాతానికి పైగా చిన్నారులు ఏదోక రకం నులిపురుగుల బారిన పడి రక్తహీనతకు, అనారోగ్యానికి గురవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. బాలబాలికలు ఆల్బెం జోల్ మాత్రలను తీసుకొని ఆరోగ్యంగా ఉండా లని సూచించారు. డాక్టర్ బి.రవి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం అనంతరం అరగంట తర్వాత అల్బెండజోల్ టాబ్లెట్ తీసుకోవాలని, 1 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులు సగం టాబ్లెట్, 6 నుండి 19 ఏళ్లలోపు వారు ఒక్క టాబ్లెట్ తీసుకోవాలని తెలిపారు. నులి పురుగుల వల్ల రక్తహీనత, నీరసం, ఆయాసం, ఎదుగుదల లోపించడం, మల, మూత్ర విసర్జన ప్రదేశాల్లో దురద, చర్మంపై ఎర్రని దద్దుర్లు, దురద, బరువు తగ్గడం, పోషకాహార లోపం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, మలంలో రక్తం, జ్వరం, తలనొప్పి ఉండడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కలుగుతా యన్నారు. నులి పురుగులు శరీరంలోకి ప్రవేశించకుండా భోజనానికి ముందు, ఆటలు తర్వాత, మల విసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని చెప్పారు.

పల్నాడు రైతులకు వరమైన వానలు

పెరిగిన సాగు విస్తీర్ణం



పత్తి పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ జగదీశ్వరరెడ్డి తదితరులు

ప్రజాశక్తి- మాచర్ల

పల్నాడు ప్రాంతంలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు రైతులకు వరంగా మారాయి. గతేడాదితో పోల్చుకుంటే సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. మాచర్ల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల వారి కార్యాలయ పరిధిలోని ఐదు మండలాల్లో పొలం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొత్తం 1,49,560 ఎకరాల సాగు భూమి వుండగా ఇప్పటికీ 1,11,267 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అక్టోబర్‌లో మరికొన్ని పంటలు సాగు చేసే అవకాశం ఉంది. నాగార్జున సాగర్ రిజర్వాయర్ నిండటం వల్ల కుడి కాల్వకు సకాలంలో నీరు విడుదల చేయటం వల్ల పంటల సాగు పెరిగింది. దీనికి అధిక వర్షాలు కూడా రైతులకు మేలు చేశారు. ఇప్పటి వరకు మాచర్ల వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో వరి 18,675 ఎకరాలు, కంది 23,307 ఎకరాలు, మినుము 15 ఎకరాలు, పెసలు 20 ఎకరాలు, పత్తి 39,760 ఎకరాలు, పొగాకు 1,123 ఎకరాలు, మిర్చి 27082 ఎకరాలు, మిగిలిన పంటలు 1,180 ఎకరాల్లో సాగవుతు న్నాయి. వ్యవసాయ సహాయ సంచాకులు జగదీశ్వరరెడ్డి మంగళవారం వ్యవసాయాధికారులతో కలిసి పొలాలను పరిశీలించారు. పత్తి, మిరప, వరి, కంది పంట సాగు బాగా పెరిగిందన్నారు. ఈ ప్రాంత రైతులకు అధిక వర్షాలు బాగా అనుకూలంగా వున్నాయని తెలిపారు. రైతులు మేలైన సాగు పద్ధతుల్లో వ్యవసాయం చేయటం వల్ల మంచి దిగుబడులు వస్తాయని, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు.



సాధారణ కుర్చిలో విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మర్యాదపూర్వక సేవలు అందించేందుకు ప్రభుత్వం సంస్కరణలు చేపట్టడంతో మాచర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటి వరకు సబ్ రిజిస్ట్రార్ కూర్చొనేందుకు న్యాయమూర్తుల తరహాలో ప్రత్యేకంగా ఉండే ఎత్తయిన పోడియం, ప్రత్యేక కుర్చి, రెయిలింగ్‌లను, ఎర్రని వస్త్రం వంటి వాటికిని తొలగించి, వాటి స్థానంలో టేబుల్, కుర్చి వేశారు. సబ్ రిజిస్ట్రార్ పల్లపు ప్రశాంతి మంగళవారం సాధారణ టేబుల్ వద్ద కూర్చుని విధులు నిర్వహించారు. క్రయ, విక్రయదారులు సబ్‌రిజిస్ట్రార్ అధికారి ముందు కుర్చిల్లో కూర్చుని తమ పనులు చేయించుకున్నారు. కార్యాలయాల్లో పోడియాన్ని చూస్తే, క్రయవిక్రయదారులకు కోర్టులో ఉన్నామన్న భావన కలుగుతోందని వాటిని తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మూడ్రోజుల క్రితం ఆదేశించారు. ఉద్యోగులు ప్రజాసేవకులుగా, స్నేహపూ ర్వకంగా పని చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కీలకమార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దానికి అనుగుణంగానే మాచర్ల కార్యాలయంలో మార్పులు జరిగాయి.

పతకాలు తెస్తున్నా.. ఆటస్థలం లేక..



ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని మిట్టగుడిపాడు సమీపంలోగల కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు క్రీడాస్థలం లేక ఆటలకు దూరమవుతున్నారు. ఉన్న ఆటస్థలమంతా రాళ్లు రప్పలతో నిండి ఉంది. ఆక్కడ ఆడుకోవడం అటుంచి కనీసం నచినా కాళ్లు బెనకడం ఖాయంగా ఉంది. 2011 మార్చి 21న కేజీబీవీ పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటినుంచి పరిస్థితులు ఇలానే ఉన్నాయి. ఇక్కడ ఆట స్థలం లేకపోయినా ఇతర మైదానాల్లో ఆటలాడి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపినా బాలికలున్నారు. ఈ నెల 13న గురజాల ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి పాఠశాలను సందర్శించి ఆట స్థలం ఇలా ఉంటే ఎలా అని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. నిధులు విడుదల కాకపోవడమే సమస్యకు కారణమని తెలిపారు. దీనిపై ప్రత్యేక దష్టి కేంద్రీకరించి ఆట స్థలాన్ని బాగు చేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.

అధికారులను కాపాడ్డానికి విఆర్ఏ సస్పెన్షన్ దారుణం

విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళనలు : విఆర్ఏల సంఘం



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న నాయకులు, విఆర్ఏలు

పజాశక్తి-సత్తెనపల్లి

పల్నాడు జిల్లా కొండమోడు ఇసుక డంపింగ్ యార్డ్ వద్ద ఇసుక రవాణాకు సంబంధించి ఇనిమెట్ల విఆర్ఏ సిద్ధయ్యను సస్పెండ్ చేయడం దుర్మార్గమని, అతన్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విఆర్ఏల సంఘం పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు గుంటూరు మల్లేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో పల్నాడు జిల్లా విఆర్ఏల సంఘం విస్తృత సమావేశం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ బందగీ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఇటీవల మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం మల్లీశ్వరి మాట్లాడుతూ కొండమోడు డంపింగ్ యార్డ్ వద్ద ఇసుక రవాణాకు సంబంధించి తప్పు చేసిన అధికారులను కాపాడేందుకు చిరు ఉద్యోగులను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. అతన్ని విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళన తప్పదన్నారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి పార్లమెంటులో కార్మికుల సమస్యలను ప్రస్తావించేవారని, కార్మిక వర్గ రాజ్య స్థాపన ధ్యేయంగా పనిచేశారని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు మనమంతా ఆయన బాటలో పయనిద్దామని చెప్పారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు జి.బాలకృష్ణ, పి.మహేష్, ఎ.వెంకటనారాయణ, ఎ.సీత, ఎనుముల బజారు, విఆర్ఏల సంఘం సత్తెనపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, మండల అధ్యక్షులు రవి, నకరికల్లు మండల నాయకులు శ్రీకాంత్, క్రోసూరు, బెల్లంకొండ, శావల్యాపురం మండలాల అధ్యక్షులు దినేష్, సుందర్‌రావు, తిరుపతయ్య, నాదెండ్ల మండల నాయకులు వెంకయ్య, గురజాల మండల నాయకులు ఏడుకొండలు, విఆర్ఏలు పాల్గొన్నారు.

రైతుల్ని ఆదుకోవాలని అధికారులకు వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఆగస్టు 30, 31 వ తేదీలలో కురిసిన అధిక వర్షాలకు పంటల మునిగి దెబ్బతిన్న రైతుల్ని ఆదుకోవాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు అన్నారు. మంగళవారం ఎం టి ఎం సి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో రైతు, కౌలు రైతు సంఘం నాయకులతో కలిసి, రైతు భరోసా కేంద్రం అధికారి శాంతిశ్రీ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ ఆగస్టు నెల చివరిలో కురిసిన అధిక వర్షాలకు చిర్రావూరు గ్రామంలోని రైతులు, కౌలు రైతులు, పాడి రైతులు విపరీతంగా నష్టపోయారని అన్నారు. గ్రామ పరిధిలోని లంక పొలాలలో వ్యవసాయ పంటలు పూర్తిగా నీట మునిగి, సేద్యం చేసే రైతన్న కు కన్నీరే మిగిలిందన్నారు. అదేవిధంగా లక్షణాల్లో పెట్టుబడులు పెట్టి, వరి, చెరుకు, పసుపు, అరటి, వివిధ రకాల కూరగాయ తోటలన్నీ కృష్ణా నదిలో పూర్తిగా మునిగాయన్నారు. అంతేకాకుండా గ్రామానికి చెందిన 10 పాడి పశువులు కృష్ణానది వరదలలో కొట్టుకుపోయాయని, లంక పొలాలలో సుమారు 25 ఎకరాలలో డ్రిప్ పైపులు పనికి రాకుండా పాడయ్యాయని అన్నారు. అధికంగా వరద చేరడం వల్ల లంక పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా నీట మునిగాయనీ తెలిపారు. తక్షణమే ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు పసుపు, కూరగాయ పంటలకు ఎకరానికి రూ.25000, కంద పంటకు ఎకరానికి లక్ష రూపాయలు , పాడైపోయిన డ్రిప్ పైపుల రైతులకు కొత్త డ్రిప్ పైపులు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. అంతేకాకుండా మండలంలోనే అత్యధికంగా ఉన్న పాడి పశువులు ఉన్న చిర్రావూరు గ్రామ పశువుల ఆసుపత్రికి వెంటనే డాక్టర్ని నియమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, మేడూరి పాములు, శంకర్, కౌల్ రైతు సంఘం నాయకులు పల్లపాటి సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల నాయకులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, వేణు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తానన్న రూ.20 వేలు వెంటనే ఇవ్వాలని రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకటశివరావు కోరారు. మంగళవారం రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నాగులపాడు, పెదనందిపాడు, వరగాని, పాలపర్రు గ్రామాల సచివాలయాల అధికారులకు రైతుల సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటశివరావు మాట్లాడుతూ రైతులకు హామీ ఇచ్చిన ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేయాలని, కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కోరారు. రైతు సేవా కేంద్రాలలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే అమలు చేయాలని కోరారు. నల్లమడ వాగు ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టి వరద ముంపు నుండి కాపాడాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ముద్దన వెంకటేశ్వర్లు, నాయకులు జంపని రామారావు, దొప్పలపూడి రమేష్ బాబు, చుక్కా యానాదులు, పోపూరి సుధీర్, కాపు వెంకట సుబ్బారావు, నల్లమోతు రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



చిర్రావూరు ఆర్‌బికెలో వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు



పెదనందపాడు మండలంలో సచివాలయంలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పవర్ లిఫ్టింగ్‌లో ఓవరాల్ ఛాంప్ గుంటూరు జిల్లా

ప్రజాశక్తి - మంగళగిరి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన 11వ ఆంధ్రప్రదేశ్సబ్ జూనియర్, సీనియర్, మాస్టర్ (మెన్ అండ్ ఉమెన్) క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ మరియు బెంజ్ ప్రెస్ ఛాంపియన్షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా పోర్న్ టీంకు ఓవరాల్ టీం ఛాంపియన్షిప్ మొదటి స్థానం సాధించారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని మంగళవారం తెలియజేశారు. మహిళల పురుషుల టీం ఛాంపియన్షిప్, పవర్ లిఫ్టర్లు ప్రతిభ కనబరిచి బంగారు, రజత, కాంశ్య పతకాలు సాధించారని ఈ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టీం ఛాంపియన్షిప్ సాధించిన ఇండివిడ్యూల్ మెడల్స్ సాధించారని వారు తెలిపారు. పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్ న్ వంశీకృష్ణ, అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కర్ రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు బి ప్రసాద్, పి భాస్కర్, బి. చంద్రిక, జాయింట్ సెక్రటరీలు ఘట్టమనేని సాయిరేవతి, ఎస్ డి మస్తాన్ వలి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఏ. పవన్ కుమార్, పి. సందీప్, జి. నాగమల్లేశ్వరరావు, ఎస్.కె. సుభాని, మధుబాబు మరియు క్రీడాకారులు క్రీడాభిమానులు అభినందించారు.



విజేతలతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

యానిమేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-గుంటూరు

యానిమేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని యూని యన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం పాత గుంటూరు సిఐటియు జిల్లా కార్యాల యంలో యానిమేటర్ల ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా కమిటీ సమావేశం కాకాని పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతు నిబంధనలకు విరుద్ధంగా అధికారులు యానిమేటర్లను బెదిరించడం సరికాదని అన్నారు. బలవంతపు రాజీనామాలు చేయిస్తే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. అధికారులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ఉద్యోగ ధర్మాన్ని విస్మరించడమేనని అన్నారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తక్షణమే యానిమేటర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా వేతనాలు లేకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. యూని యన్ జిల్లా కార్యదర్శి శివకుమారి మాట్లాడుతూ యాని మేటర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మూడు సంవత్సరాల కాల పరిమిత రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యానిమెట్లపై జరుగుతున్న రాజకీయ వేధింపులు తిప్పికొట్టేందుకు యానిమేటర్లు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.



మాట్లాడుతున్న ధనలక్ష్మి

డాక్టర్ పట్టాభిరామయ్య, డాక్టర్ అనూషకు నన్నపనేని లక్ష్మీ సేవా పురస్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి రాయల్ బాంకెట్స్‌లో ఆంధ్ర నాటకళా సమితి, శ్రీ నన్నపనేని బాపనయ్య, సీతారావమ్మ అండ్ లక్ష్మీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ సంఘ సేవకురాలు శ్రీమతి నన్నపనేని లక్ష్మీ స్మారక పుర స్కారాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రముఖ సంఘ సేవకురాలు శ్రీమతి అబ్బూరి రత్న లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు.నాటక కళా సమితి, ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రకటించిన పురస్కారాలను సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు అధ్యక్షత సభలో డాక్టర్ యర్రం నాగేశ్వరరావు, కమ్మ ఐకాన్ మొబైల్ ఆప్ ఆండ్రాయిడ్ ఐఓఎస్ లెజెండరీ అవార్డు 2023-2024 సంబంధించిన అవార్డును ప్రముఖ పారిశ్రామికవేత్తలు అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, పరుచూరి వెంకటేష్, అమరావతి ఉద్య మంలో చురుకుగా పాల్గొన్న డాక్టర్ వద్ద రామలింగేశ్వర రావు, కమ్మ వాయిస్ చీఫ్ ఎడిటర్ జి సంజీవ్ కుమార్ లకు అందజేశారు. 2023 సంవత్సరానికి విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కామినేని పట్టాభి రామయ్య, 2024 సంవ త్సరానికి మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీమెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష లకు పురస్కారాలు అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ యర్రం నాగేశ్వరరావు మాట్లాడుతూ నన్నపనేని లక్ష్మి రెండు దశాబ్దాల పాటు ఎన్నో సేవా కార్యక్ర మాలు నిర్వహించి ప్రముఖ సంఘసేవకురాలుగా సమాజ ంలో స్థిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. ఆమె సేవలకు గుర్తుగా స్మారక పురస్కారాలు అందజేయడం అభినం దనీయమన్నారు. లక్ష్మి స్మారక పురస్కార గ్రహీత డాక్టర్ కామినేని పట్టాభి రామయ్య మాట్లాడుతూ గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది కళాకారులను తీసుకొని వచ్చి మంగ ళగిరిలో జానపద కళా సంబరాలు నిర్వహించా మన్నారు. డాక్టర్ పీ అనూష మాట్లాడుతూ వరుసగా రెండు, మూడు రోజులు సేవా కార్యక్రమాలు చేయడమే చాలా గొప్ప విషయమని అయితే నన్నపనేని లక్ష్మి 100 రోజులు పాటు వరుసగా సేవా కార్యక్రమాలు చేసి రికార్డు సాధించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కళా సమితి ఉపాధ్యక్షులు పరుచూరి వై ఎన్ రావు, కోశాధికారి జవ్వాజి ప్రసాద్, సిటీకేబుల్ మేనేజింగ్ డైరెక్టర్ రావూరి రమేష్ బాబు, గుత్తికొండ ధనుంజయరావు, గోలి మధు తదితరులు పాల్గొన్నారు. తొలుత నన్నపనేని లక్ష్మి చిత్రపటానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీమతి నన్నపనేని లక్ష్మి స్మారక పురస్కారాల సందర్భంగా నేటి పౌరుషం పత్రిక శ్రీమతి లక్ష్మి సేవా కార్యక్రమాలపై ప్రచురించిన ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు.



పురస్కారం అందుకుంటున్న వైద్యులు పట్టాభి రామయ్య అనూష



చెక్కును కలెక్టర్‌కు అందచేస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

వరద బాధితులకు క్రెడాయ్ రూ.7 లక్షల విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

వరద బాధితుల సహాయార్థం క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.7 లక్షలు అందచేశారు. ఈ మేరకు విరాళం చెక్కును మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు క్రెడాయ్ ప్రతినిధులు అందచేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, గుంటూరు చాప్టర్ చైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము, వైస్ ప్రెసిడెంట్ తియ్యగూర వినోద్‌రెడ్డి, వెల్లపు శివనాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ అన్నప్పరెడ్డి భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇటీవల వచ్చిన వరదల వల్ల నష్టపోయిన బాధితులకు అండగా వివిధ సంస్థల నిర్వాహకులు, ప్రముఖులు మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి విరాళాలు అందజేశారు. ఎస్‌వి యూనివర్సిటీ ఇన్‌ఛార్జి విసి అప్పారావు, రిజిస్ట్రార్ ఎం.భూపతినాయుడు నేతృత్వంలో 47,46,380 రూపాయల చెక్కు అందజేశారు. ఎపి ఫ్లెక్సీ ప్రింట్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ రూ.5 లక్షలు, అమలాపురానికి చెందిన చెరుకూరి రామచంద్రరావు రూ.45 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన సునీత డిజైనర్ రూ.2.35 లక్షలు, గుంటూరు రంగా మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులు జి.రామస్వామి రూ.1.11 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన పొట్లూరి సాయినాగార్జున రూ.55 వేలు, నిడమానూరుకు చెందిన లాల్‌బి రూ.55,550 అందజేశారు. వీరందరికీ మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.



పెదనందిపాడులో వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు గత నాలుగు నెలల నుండి పెండింగ్లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సిఐటియు మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు కోరారు. పెదనందిపాడు మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మరియు మండల ప్రజా పరిషత్ అధికారికి, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ గత నాలుగు నెలల నుంచి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు జీతాలు చెల్లించక పోవడం సమంజసం కాదన్నారు. వారికి ఇస్తున్న కొద్దిపాటి వేతనాలను కూడా సక్రమంగా అందచేయకపోవడం పట్ల అసంతప్తి వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు జమ చేయాలని కోరారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన దష్ట్యా, వారి జీతాలను కనీసం పదివేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం నాయకులు (సిఐటియు) పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ, ప్రజాసంఘాల నాయకులు కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, చుక్కా యానాదులు, నల్లమోతు రాజేంద్ర పాల్గొన్నారు.



ప్రత్తిపాడు లో 'ప్లాంట్ ఫర్ మదర్'

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలంలో మంగళవారం ఉపాధి హామీ పథకం డిపార్ట్మెంట్ వారి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పత్తిపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా వంగీపురం సర్పంచి శిఖా విజయలక్ష్మి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇన్ఛార్జి ఏపీఓ వలి మాట్లాడుతూ మొక్కలు నాటడం పర్యావన కాలుష్యాన్ని తగ్గించవచ్చున్నారు. ఆక్సిజన్ విడుదల చేయడం వల్ల ప్రాణవాయువు అందుతుందన్నారు. వాతావరణ మార్పులు చెట్లు నరికివేయడం వలన చోటు చేసుకుంటున్నాయి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

ఇర్లపాడు చెరువు వేలంపాట

ప్రజాశక్తి - నాదెండ్ల

నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామ పంచాయతీలో ఉన్న మైనర్ ఇరిగేషన్ చెరువుకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. 230-బిలో చేపలు వేసి పట్టుకునే హక్కును 1434, 1435ల రెండు సంవత్సరాలకుగాను ఇర్లపాడుకు చెందిన పసల వెంకట సుబ్బారావు రూ.23,50,000కు వేలం పాట పాడుకున్నారు. ఈ పాటలో ఇఓపిఆర్డి షేక్ జాకీర్ హుస్సేన్, పంచాయతీ సెక్రటరీ, గ్రామస్థులు పాల్గొన్నారు

మరమ్మతు పనుల నిమిత్తం నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో శాంతినగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ షట్టర్స్ మరమ్మతు పనుల నిమిత్తం నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేటలో బుధవారం సాయంత్రం నుండి గురువారం ఉదయం వరకు, ప్రకాష్ నగర్, రామిరెడ్డిపేట, అరండల్ పేట, వరవకట్ట, బి.సి. కాలనీ, చాకిరాలమిట్ట, చంద్రబాబునాయుడు కాలనీ, పట్టణ శివారు ప్రాంతాలలో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం యధావిధిగా నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రార్ ఆఫీసులో మార్పులపై హర్షం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాచరిక పోకడలను మానుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడు రోజుల క్రితం ఆదేశించారు. ఆ వెనువెంటనే స్థానిక సబ్‌రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో పోడియంను, రేలింగును తొలగించారు. అంతే కాకుండా క్యాబిన్, విల్‌ఛైర్ తీసేసి టేబుల్, సాధారణ కుర్చీ వేశారు. ఇలా ఆదేశాలు రాగానే మంగళవారం అలా మార్చేయడం పట్ల ఆ కార్యాలయానికి వచ్చేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదేవిధంగా కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. మంచినీరు, మహిళలకు యూరినల్స్, టాయిలెట్స్, వినియోగదారులు కూర్చొనేందుకు ఎక్కువ కుర్చీలు, మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.





స్వచ్ఛతాహిసేవా ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



పశువేముల ఎంపిపి స్కూల్ విద్యార్థులతో స్వచ్ఛతా హి సేవా ర్యాలీ

జీవన విధానంలో స్వచ్ఛత వెల్లివిరియాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మన సంస్కారంలో, స్వభావంలో స్వచ్ఛత వెల్లివిరియాలని, స్వచ్ఛత జీవన విధానంగా మారి జిల్లా ప్రజల సంస్కృతిలో భాగం కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో కలిసి స్వచ్ఛతాహిసేవా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పల్నాడు బస్టాండు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అక్టోబరు 02 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన 'స్వచ్ఛతా హి సేవ' పథకంలో భాగంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 3 విభాగాలుగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టి చెత్తను తొలగించడం, పారిశుధ్య కార్మికులకు కోసం ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి కనీస వసతులు కల్పించడం, స్వచ్ఛతను పెంపొందించడంలో ప్రజలను భాగస్వాములను చేయడం లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల శుభ్రత ద్వారా ప్రజారోగ్యం ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. పరిసరాల శుభ్రతాప్రాధాన్యతను ప్రజలకు క్షేత్ర స్థాయిలో తెలియజెప్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'స్వచ్ఛతా హి సేవా'ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రా రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో మొక్కలు నాటడానికి కృషి చేయాలని ఈవోపీఆర్డి కోటేశ్వరరావు కోరారు. మంగళవారం మండల కేంద్రమైన రెంటచింతలలో గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు, వివిధ శాఖాధికారులతో కలిసి పురవీధుల్లో ప్రదర్శన, మానవహారం నిర్వహించి ఈ పథకం ప్రాధాన్యతను వివరించారు. వచ్చే నెల 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్తు, నీటిని ఆదా చేయడం, ప్లాస్టిక్ నిరోధించటం తాగునీటి క్లోరినేషన్ ఆరోగ్యకరమైన జీవితం తదితర అంశాలపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తామన్నారు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మోహన్, ఉపాధిహామీ ఏపీవో జయచంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ముప్పాళ్ల

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడడంతో పాటు మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంపిడివో పుట్టారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్ల జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులతో మంగళవారం ర్యాలీ నిర్వహించి మానవహారం పాటించారు. ఈ సందర్భంగా చాగంటివారిపాలెం సచివాలయం వద్ద ప్లాంట్ ఫర్ మదర్ కింద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇఓపిఆర్డి రూపవతి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏపిఎమ్ బాలస్వామి, ఏపివో ఏడుకొండలు, ముప్పాళ్ల జెడ్పిహెచ్ఎస్ హెచ్ఎమ్ నాగేంద్రమ్మ, డిబిఆర్సి కో ఆర్డినేటర్ మేడే వెంకటరమణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, చాగంటివారిపాలెం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మాచర్ల

స్వచ్ఛాంధ్రప్రదేశ్ సధనకు కృషి చేయాలని మున్సిపల్ ఛైర్మన్ నరసింహారావు అన్నారు. మంగళవారం ఆయన స్వచ్ఛతా హి సేవ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను ప్రారంభించారు. మున్సిపల్ అధికారులు, కార్మికులు, సచివాలయ సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ నరసింహారావు మాట్లాడుతూ మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సహకారంతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, మెప్మా అధికారి సుబ్బారావు, వెంగయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం పశువేముల ఎంపిపి స్కూల్ విద్యార్థులు స్వచ్ఛతా హి సేవా ర్యాలీని అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మానవహారం పాటించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కర్రా చిన రంగయ్య, ఉపసర్పంచి కిన్నెరా దేవదానం, పంచాయతీ కార్యదర్శి పి.బాబు లాల్ నాయక్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు భూసాని ఆసయ్య, మహిళా పోలీస్ లక్ష్మి, సచివాలయం సిబ్బంది , గ్రామ పెద్దలు పోచిమళ్ళ బాబు, నర్సింగ్ ఫకీరయ్య (పవన్), శర్కకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ దోసాపాటి అనిల్ పాల్గొన్నారు.

వరద కారణంగా నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలి



ప్రజాశక్తి - పెదకూరపాడు

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నియోజవర్గ పరిధిలోని పెదకూరపాడు క్రోసూరు అమరావతి అచ్చంపేట మండలాలలో కృష్ణానది పరివాహ ప్రాంతంలో పత్తి రైతులు వాగులువంకలు నీటి ప్రవాహానికి పత్తి రైతులు కుదిలేయ్యారని వారిని ఆదుకోవాలని పెదకూరపాడు నియోజవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు కోరారు. నియోజవర్గ కేంద్రమైన పెద్దకూరపాడులో రెవెన్యూ శాఖ అధికారులకు, వ్యవసాయ శాఖ అధికారులకు రైతు సంఘం సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం వినతపత్రాన్ని అందించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం శ్రీనివాసరావు రైతు సంఘం నాయకులు సుభాని మాట్లాడుతూ ఇప్పటికే పత్తి కౌలు రైతులు ఎకరానికి రూ.50 వేల పెట్టుబడి పెట్టి వర్షాల కారణంగా నష్టపోయారని, ఎకరానికి రూ.30వేలు నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోపూరు సుభాని మలినేని బసవయ్య, చిర్రా సాంబిరెడ్డి సబ్జాన్ మస్తాన్వలి, సిపిఐ నాయకులు కడియాల శ్రీనివాసరావు, ఎస్కే నాగులమేర, తాళ్లూరి రాంబాబు పాల్గొన్నారు.

మాచర్లలో ప్రధాని జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - మాచర్ల



దేశ ప్రధానమంత్రి మోడీ పుట్టినరోజు సందర్భంగా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతి కుమార్ అధ్యక్షతన, ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి కేక్ కట్ చేసి మాట్లాడారు. సామాన్య స్థాయి నుండి ప్రధానమంత్రి స్థాయికి మోడీ ఎదిగారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, బీజేపి నాయకులు కూని శెట్టి వెంకటేశ్వర్లు, బొగ్గువరపు మస్తాన్‌రావు, పోకూరి కాశీపతి, ఏచూరి సురేష్, కనకంటి కోటేశ్వరరావు, జివి.శెట్టి బ్రహ్మయ్య, బత్తుల రాంబాబు, మారం వంశీకృష్ణ, సన్నాయిల బ్రహ్మం, బొడ్డుపల్లి ఈశ్వరయ్య, గోపువరపు చెన్నకేశవ, మొగులూరు ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర రజక జనసేవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక యానాది కాలనీ హైస్కూలు వద్ద పెరియార్ రామస్వామి 145వ జయంతి సభను మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సభకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సీనియర్ బిసి నాయకులు వై.కె., పివి రమణయ్య,వివిధ సంఘాల నాయకులు జి ఆర్ భగత్ సింగ్, నల్లపు నీలాంబరం, విప్పర్ల ముత్తయ్య,పెనుమాక రమాదేవి,చింతా రాంప్రసాద్, వర్ధన్ యాదవ్ , తాటికొండ నరసింహారావు, బి బ్రహ్మయ్య, పద్మశాలి సంఘం నగర అధ్యక్షులు వీరయ్య, ఆవాజ్ నగర అధ్యక్షులు షేక్ సైదా తదితరులు రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



పెరియార్ రామస్వామి తన జీవితమంతా బ్రాహ్మణులు భావజాలానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు.

ప్రజాశక్తి మంగళగిరి : దేశంలో దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనారిటీలుగా అణచివేత, పీడన, దోపిడీలకు గురవుతున్న అణగారిన వర్గాల వారందరూ ఆత్మగౌరవంతో తలెత్తుకునేలా కృషి చేసిన ఆత్మగౌరవ పితామహుడుగా పెరియార్ ఇ.వి. రామస్వామి నాయర్ ఖ్యాతి గడించారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. మంగళవారం పెరియార్ 145 వ జయంతి, సకల కళలకు అధిపతి అయిన భగవాన్ శ్రీ విశ్వకర్మ జయంతులు స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నాయకులు పెరియార్ చిత్రపటానికి, భగవాన్ శ్రీ విశ్వకర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ యువజన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, ఉప్పాల రాజ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వీధులను ఊడుస్తూ స్వచ్ఛతా హీ సేవ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం కమిషనర్ ఛాంబర్‌లో, కౌన్సిల్ సమావేశ మందిరంలో ఐటిసి ఎంఎస్కేఅండ్ ఫినిష్ సొసైటీ రూపొందించిన స్వచ్ఛత హి సేవా పోస్టర్‌ను నగర కమిషనర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐటిసి ఎంఎస్కే అండ్ ఫినిష్ సొసైటీ నుండి నిరంజన్, నారాయణ, తిరుపతిరెడ్డి, జిఎంసి అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్, శ్రీనివాస్, టి.వెంకట కష్ణయ్య, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్.ఈ. శ్యాం సుందర్, ఎంహెచ్‌ఓలు మధుసూదన్, రామారావు, మేనేజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్, ఐటిసి ప్రతినిధులు

ప్రజాశక్తి - తెనాలి, తెనాలి రూరల్

కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమం మంగళవారం పట్టణంలో ప్రారంభమైంది. పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమ ర్యాలీని చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక ప్రారంభించారు. ర్యాలీ పురపాలక సంఘ కార్యాలయం నుండి గంగానమ్మ పేట, సాయిబాబా గుడి మీదుగా తెనాలి రేల్వే స్టేషన్ వరకు జరిగింది. కమిషనర్ బి శేషన్న మాట్లాడుతూ 40 వార్డులలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ మాలేపాటి హరిప్రసాద్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు. తెనాలి ఆర్టిసీ బస్టాండ్ లో తమ సిబ్బందితో కలసి ఆర్టిసి ఆవరణను పరిశుభ్రం చేయనున్నట్లు డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ వెల్లడించారు. మేనేజర్ తో సహా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్, హెడ్ కానిస్టేబుల్ 60 మంది ఉద్యోగులతో కలసి గ్యారేజి గేటు ఆవరణలో చెత్త, చెదారాలను తొలిగించారు.

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర ప్రభుత్వము, దేవదాయ ధర్మదాయశాఖ కమిషనరు ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభించినట్లు పెదకాకాని దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ ఉప కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ చెప్పారు. తొలిరోజున దేవాలయంలో నంది మండపము, ముఖ మండపము, సీలింగ్, ఫ్లోరింగ్, గోడలు, సీలింగ్ ఫ్యానులు, శ్లాబ్ పై భాగము శుభ్రం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఖాళీ ప్రదేశములో మొక్కలు నాటినట్లు ఆలయ ఉపకమిషనర్ తెలిపారు.

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో ఎంటిఎంసి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా పెద్ద ఎత్తున నిర్వహించారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ , నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నగర పాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషాతో కలిసి మంగళవారం ప్రారంభించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం సందర్భంగా నేతన్న సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించి అందరితో ప్రతిజ్ఞ పాటించారు. అనంతరం నేతన్న సర్కిల్ నుంచి టిడ్కో గృహ సముదాయం వరకు సచ్ఛతా హి సేవ ర్యాలీ నిర్వహించారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలకు తాత్కలిక మరమ్మతులు చేపట్టారు. అనంతరం టిడ్కో సముదాయంలో పరిశుభ్రతపై మెగా డ్రైవ్ నిర్వహించారు.

ప్రజాశక్తి - పొన్నూరు

పూజ్య బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, స్వచ్ఛభారత్ లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణం లో పారిశుధ్య కార్మికులు, కూటమి నాయకులతో కలసి చీపుర్తు చేతపట్టి మున్సిపల్ కమిషనర్ వీధులను శుభ్రపరిచారు.

ప్రజాశక్తి ప్రత్తిపాడు : ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎస్ కార్యక్రమం ఎంపిపి దాసరి అన్నమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఈఓపీఆర్డి షేక్ ఖాజా, అర్ డబ్ల్యుయూఎస్ ఏ ఈ, పి అర్ ఏ ఈ, మండల విద్య వనరుల శాఖ అధికారి రమాదేవి, మండల వ్యసాయాధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

తుళ్లూరులో ఎన్ హెచ్ ఎస్ లో మండల ప్రజా పరిషత్ కార్యాలయం దగ్గర నుంచి తులసీ థియేటర్ సెంటర్ వరకు మండల ప్రజా పరిషత్, పంచాయతీ,గ్రామ సచివాలయ అధికారులు,సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ,డ్వాక్రా మహిళలు, పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మనవహారంగా ఏర్పడ్డారు.

ప్రజాశక్తి దుగ్గిరాల : మండల కేంద్రం దుగ్గిరాలలో స్వచ్ఛతాహి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికార యంత్రాంగం తో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఇన్చార్జి ఎంపీపీ షేక్ షబానా మాట్లాడుతూ ఆరోగ్య పరి రక్షణ కోసం పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. డిపిఓ కుసుమ శ్రీదేవి మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. టిడిపి వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు జడ్పిటిసి మేకతోటి అరుణ సర్పంచ్ బాణావత్ ఖుషి బాయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎస్ హెచ్‌ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీడీవో బి బాబురావు మాట్లాడుతూ పారిశుధ్యాన్ని ప్రతి ఒక్కరి బాధ్యతగా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈవో పీఆర్ అండ్ ఆర్ డి జి శ్రీనివాసరావు, ఏ ఈ ఆర్ డబ్ల్యు ఎస్ పి శ్రీనివాసరావు , మండల కోఆర్డినేటర్ జి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



కొల్లా వెంకయ్యకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి - పెదనందిపాడు

నల్లమడ రైతు సంఘం వ్యవస్థాపకులు, ఎమ్మెల్యే, ఎంపీగా సేవలందించిన కమ్యూనిస్టు నేత కొల్లా వెంకయ్య 26వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సిపిఎం పెదనందిపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి నివాళు లర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకునిగా కొల్లా వెంకయ్య అనేక పోరాటాలు నడిపారని తెలిపారు, నల్లమడ వాగు ఆధునీకరణకు, గుంటూరు ఛానల్ పొడిగించాలన్న రైతుల డిమాండ్ పై వారి ఆధ్వర్యంలో విశేష కృషి జరిగిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం పెదనందిపాడు మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, చుక్కా యానాదులు, కాపు వెంకట సుబ్బారావు, నల్లమోతు రాజేంద్ర పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు అభిమాని శ్రీనివాసరావు కన్నుమూత

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీకి చెందిన సిఐటియు అభిమాని బి శ్రీనివాసరావు (56) మంగళవారం మృతి చెందారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాసరావు భౌతిక కాయం పై సిఐటియు నాయకులు జెవి రాఘవులు, ఎస్ ఎస్ జంగయ్య, ఎం బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రేపటి నుండి మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల స్థాయి ఆటల పోటీలు గురు శుక్రవారాలలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్‌లో నిర్వహించనున్నట్లు మండల క్రీడా కోఆర్డినేటర్ వై కోటేశ్వరరావు తెలిపారు. గురువారం బాలికలకు, శుక్రవారం బాలురకు నిర్వహిస్తామని తెలిపారు. మండల స్థాయిలో రాణించిన క్రీడాకారుల ఎంపిక కూడా నిర్వహించనున్నారు. బుధవారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు కూడా పాల్గొనవచ్చు. ఈ పోటీల్లో వాలీబాల్ కబడ్డీ బ్యాట్మెంటన్ కోకో చెస్ యోగ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

లచ్చి వెంకటేశ్వరరావుకు సతీ వియోగం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



ఎంటిఎంసి పరిధిలోని ఇప్పటం గ్రామానికి చెందిన వైయస్సార్సీపి గ్రామ అధ్యక్షులు లచ్చి వెంకటేశ్వరరావు భార్య లచ్చి ముని కన్యాకుమారి (64) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కన్యాకుమారి మృతి వార్త తెలుసుకున్న సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, వైఎస్ఆర్ సిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, వైఎస్ఆర్సిపి తాడేపల్లి మండల నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి, ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నాయకులు లచ్చి తులసీదాస్, మిరియాల రాం బాబు, నూతక్కి శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు.



ఘనంగా వినాయక విగ్రహ ఊరేగింపు

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో విగ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో మంగళవారం గణేష్ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. 15 కిలోల లడ్డూను టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు రూ.50 వేలకు దక్కించుకున్నారు. 9, 5 కిలోల లడ్డూను రాజ, జానీబాష, రూ.45 వేలు, రూ.46 వేలకు దక్కించుకున్నారు. వినాయకునికి వేసిన రూ.20 నోట్ల దండను భానుప్రసాద్ రూ.21 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కిరణ్, సాయిచంద్, నాగసాయితేజ, టి.కిరణ్, వంశీ, కరిముల్లా, మహేష్, పవన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : ఇటీవల సంభవించిన వరదలకు తమ ఇళ్లు పూర్తిగా నీటమునిగాయని, ఇంట్లోని వస్తువులు ధ్వంసమయ్యాయని, తమను ఆదుకోవాలని ఉండవల్లికి చెందిన సిహెచ్.శ్రీనివాస్, ఎ.సుబ్రమణ్యం, వెంకట్రావు, సైదులు మంగళవారం నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. విజయవాడలో నిర్వహించినట్లు గుంటూరులో కూడా ఉచిత సర్వీసు సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆభరణాల తయారీ కోసం తామిచ్చిన 630 గ్రాముల బంగారాన్ని మంగళగిరిలో పని చేసే పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తి దొంగిలించాడని బెంగాల్ పారిపోయిన అతన్ని వెనక్కి రప్పించి తమ బంగారం తమకు ఇప్పించాలని మంగళగిరికి చెందిన రవికుమార్ తదితరులు అర్జీ అందజేశారు. గుండె ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం అందజేయాలని వనమా అమ్ములు, మంగళగిరి ఆటోనగర్‌లో ఉన్న ఐదు సెంట్ల భూమిని ఆక్రమించారని, తనకు న్యాయం చేయాలని దర్యాబి, వైసిపి నాయకులు దేవినేని అవినాష్ అండతో డివి సుబ్బారెడ్డి తన దగ్గర రూ.17 లక్షలు అప్పు తీసుకున్నాడని, తిరిగి చెల్లించడంలేదని, జోక్యం చేసుకొని ఇప్పించాలని ఉండవల్లికి చెందిన రమేష్ కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేష్‌కు అర్జీలు అందజేశారు.

వరద బాధితులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి : మహానాడుకు చెందిన సుమారు 200 మంది వరద బాధితులకు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు నిర్వాహకులు పురాణం వెంకటా చార్యులు మంగళవారం దుప్పట్లు, దుస్తులు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాటాడుతూ ప్రజల ఇబ్బందులు గ్రహించి తమకు తోచిన సాయం వారికి అందజేయడం జరిగిందని చెప్పారు. ఆపదలో ఉన్న ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు తమ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



రాకపోకలకు అనుమతివ్వాలని లోకేష్‌కు జనసేన వినతి

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణం నుండి ఎయిమ్స్ మీదగా జాతీయ రహదారికి చేరుకునేందుకు ఉన్న రహదారిలో రాకపోకలకు అనుమతి ఇప్పించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. మంగళవారం ఉండవల్లిలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో వారు మంత్రి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ ం కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. శాశ్వతంగా ఈ మార్గాన్ని మూసివేయడం వలన ప్రజలు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో మాట్లాడి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటానని అవసరమైతే తన సొంత ఖర్చులతో ఈ మార్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని లోకేష్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. చినకాకానిలో గుంటూరు ఛానల్ కు పడిన గండిని పూడ్చి వేయించాలని కోరారు. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని లోకేష్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఎర్రబాలెం మాజీ అధ్యక్షులు కాపరౌతు సుందరయ్య, ఎంటి ఎంపి ప్రధాన కార్యదర్శి బాణాలు నాగేశ్వర రావు చినకాకాని గ్రామ అధ్యక్షులు లింగినేని శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



టూరిజం అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఈనెల సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని 2023-24 సంవత్సరానికి వివిధ అవార్డులకు అర్హులైన పర్యాటక, సంబంధిత రంగాల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా టూరిజం అధికారి ఎ.శ్రీరమ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుండి 41 అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులను ఏపీ టూరిజం వెబ్‌సైట్ www.aptourism.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తులను ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్,ఆటోనగర్, విజయవాడలో ఈనెల 22వ తేదీలోపు అందజేయాలని కోరారు.27న అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.

రేపు టేబుల్ టెన్నిస్ ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 టేబుల్ టెన్నిస్ జిల్లా టీమ్ సెలక్షన్స్ ఈనెల 19న గుంటూరు, బి.ఆర్.స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ జి.నరసింహరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జూనియర్ కాలేజి, ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్.పద్మాకర్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. పాల్గొనే విద్యార్థులు ఇంటర్ చదువుతూ, 2006 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని, పుట్టిన తేదీ ధృవీకరణ కోసం టెన్త్ మార్కుల జాబితాపై ప్రిన్సిపాల్ సంతకం చేయించుకొని తీసుకురావాలన్నారు.

విజ్ఞాన్ అధ్యాపకురాలికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు


గాయిత్రికి పిహెచ్‌డి పట్టా అందచేస్తున్న వీసీ

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కంప్యూటర్ అప్లికేషన్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కేతేపల్లి గాయత్రికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలియజేశారు. గాయత్రి 'యాన్ ఎంపిరికల్ స్టడీ ఆన్ డీప్ లెర్నింగ్ బేస్డ్ ఎన్‌సెంబుల్ క్లాసిఫైర్స్ ఫర్ నెట్‌వర్క్ అనోమలీ డెటెక్షన్' అనే అంశంపై యూనివర్సిటీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కంప్యూటర్ అప్లికేషన్ విభాగంలోని మాజీ ప్రొఫెసర్ బి.ప్రేమామయుడు పర్యవేక్షణలో పరిశోధన చేశారన్నారు. గాయత్రిని వీసీ, డీన్‌లు, అధ్యాపకులు అభినందించారు.

పవర్ లిఫ్టింగ్‌లో వర్సిటీ ఫ్యాకల్టీకి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - ఏఎన్‌యు



ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14 నుంచి 15 వరకు అమలాపురంలో జరిగిన రెండు రోజుల 11వ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పరుచూరు కుమారి నందకు మహిళల సీనియర్ కేటగిరిలోని 76 కేజీల విభాగంలో మొదటి బహుమతి అలాగే బెంచ్ ప్రెస్ చాంపియన్షిప్ లో మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. గంగాధరరావు ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కి గంగాధర్ రావు మాట్లాడుతూ కుమారి నంద భవిష్యత్తులో జరగబోయే నేషనల్ ఈవెంట్‌లో కూడా ఇలాగే రాణించి మరిన్ని పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఆమెకి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయ విభాగ అధిపతి ప్రొఫెసర్ ఎల్. జయ శ్రీ మాట్లాడుతూ వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు ఇలా క్రీడ, సాంస్కృతిక పోటీలలో పాల్గొంటూ అటు విశ్వవిద్యాలయానికి ఇటు రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. వెంకటరమణ, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ పి శివరాం, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ ఎన్ రాధిక, ఎస్ చంద్రశేఖర్, చెన్నారావు, తదితరులు కుమారి నందకు అభినందనలు తెలిపారు.


విద్యార్థినులను అభినందిస్తున్న రామకృష్ణ ప్రభు, తదితరులు

వక్తృత్వ పోటీల్లో చలమయ్య కళాశాల విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని చలమయ్య డిగ్రీ కాలేజి విద్యార్థిని వి.పూజిత ఇటీవల టిజెపిఎస్ కాలేజిలో ఓజోన్‌డే సందర్భంగా ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన అంతర కళాశాలల వక్తృత్వ పోటీలలో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించిందని కళాశాల సెక్రెటరీ కర్పూరపు రామకృష్ణ ప్రభు తెలిపారు. మంగళవారం పూజితను, కన్సోలేషన్ బహుమతి పొందిన జిఎల్‌వి అంజనను అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ కాలుష్యం వల్ల ఓజోన్ పొరకు కలుగుతున్న నష్టం గురించి అవగాహన పెంచుకొని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఓజోన్ రక్షణతోనే భవిష్యత్ మానవాళి మనుగడ సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ ట్రెజరర్ చందోలు జయప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీధర్, ప్లేస్‌మెంట్ అధికారి చంద్రశేఖర్ కల్చరల్ కోఆర్డినేటర్ మధుసూదన్‌రావు అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ సొత్తు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్‌పి సతీష్ కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



పొన్నూరు పట్టణంలో బాపట్ల బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ వైన్స్ షాపులో దొంగలించిన నగదు దొరికిందని ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితుడు వైన్స్ షాపులో కార్మికుడిగా పనిచేసే కొప్పుల సందీప్ అలియాస్ రూబెన్ గా గుర్తించినట్టు తెలిపారు. తొలుత షాపులో చోరీ జరిగిందని ఫిర్యాదు రాగానే సందీప్‌పై అనుమానాస్పదంగా గుర్తించి విచారించగా, నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడని వెల్లడించారు. దుకాణంలోని వెనుక వైపు షట్టర్‌ను మాత్రమే మూసివేసారని, అయితే తాళం వేయలేదని అతను గమనించాడని తెలిపారు. సెలవుల్లో నగదు దొంగతనం చేయాలని నిందితుడు నిర్ణయించుకున్నాడని, ఇటీవల ఒక తాళం సెట్‌ను దొంగిలించాడని వాటి ద్వారా దుకాణంలో శెలవు రోజుల్లో నిల్వ చేసే బాక్సులో మూడు రోజుల సొమ్ము రూ.9.50 లక్షలు దాచి ఉంచడం వల్ల నిందితులు కాజేశారని తెలిపారు. 15వ తేదీ రాత్రి పొద్దుపోయిన తరువాత వెనుక వైపు ప్లేవుడ్ బోర్డు తీసివేసి వెనుక వైపు షట్టర్ ద్వారా షాపులోకి ప్రవేశించి నగదు తీసాడని తెలిపారు. నగదు దొంగలించి సొమ్మును తన కారు డిక్కీలో దాచాడని ఎస్పీ తెలిపారు. 16వ తేదీన సూపర్ వైజర్ ఎస్తేల ఏసోపు యథాతథంగా దుకాణం తెరచి చూడగా చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారించిన పొన్నూరు పోలీసులు నిందితుడు సందీప్‌ను అరెస్టు చేసి రూ.9,51,460లను స్వాధీనం చేసుకున్నారు. కేసును తెనాలి డిఎస్‌పి జనార్దనరావు ఆధ్వర్యంలో పొన్నూరు సిఐ కె.రవికిరణ్ దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు సంసిద్ధతపై జేసీ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

ఖరీఫ్ పంట కాలానికి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జేసీ ఎ.భార్గవ్‌తేజ మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు, అనుసరించవలసిన విధివిధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చర్చించారు. జేసీ మాట్లాడుతూ రైతులనుండి ఇ-పంట ద్వారా పంట నమోదు చేయించి 100 శాతం ఈకేవైసి చేయించాలని, తద్వారా రైతులందర్నీ ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలన్నారు. చేయాలని, ఇ-పంట ద్వారా ధాన్యం రకము నమోదు చేసేటప్పుడు ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఉన్న 177 మాయిశ్చర్ మీటర్లను త్వరగా క్యాలిబ్రేషన్ చేయించాలని మార్కెటింగ్ ఏడీని ఆదేశించారు. రైస్ మిల్లులను తనిఖీ చేసి, మిల్లు సామర్థ్యం, ఇతర వివరములు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలన్నారు. రైతులకు కావాల్సిన గోనె సంచులు ముందుగానే అందించే ఏర్పాట్లు చేయాలని, ధాన్యం రవాణా వాహనాలకు తప్పనిసరిగా జి.పి.ఎస్. ట్యాగింగ్ ఉండాలని తెలిపారు. జి.డి.సి.ఎం.ఎస్. వారిని రైతు సేవా కేంద్రాలలో వారి సిబ్బంది ఏర్పాటు చేసి, వారి పరిధిలో ఉన్న ప్రతీ పనినీ పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులకు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిబంధ నలు, సూచనలు చేసి రాబోయే 2024-25 ఖరీఫ్ కాలానికి అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశములో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ జి.లక్ష్మి, జిల్లా సరఫరాల అధికారి పి. కోమలిపద్మ, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ ఏడీ రాజబాబు పాల్గొ న్నారు.



ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ గుంటూరు

స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞలో కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు తమ నివాసాలతోపాటు, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచడం ఒక అలవాటుగా పాటించాలని, అప్పుడే స్వచ్ఛ గుంటూరు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ స్వచ్ఛతా హి సేవా మొదటిరోజు కార్యక్రమంలో భాగంగా జిఎంసి ఆధ్వర్యంలో వెంకటేశ్వర విజ్ఞానమందిరం, నగరాలులోని నవీన స్కూల్ వద్ద, లక్ష్మీపురంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, బి.రామాంజనేయులు, జి.మాధవి, డిప్యూటీ మేయర్ షేక్.సజిలా, కార్పొరేటర్లు, అధికారులు, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు అక్టోబర్ 2 వరకు పట్టణాలు, గ్రామాల్లో జరిగే స్వచ్ఛత కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రతి ఏడాది ఆయన జయంతి సందర్భంగా స్వచ్ఛతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ స్వచ్ఛత అంటే మన కుటుంబాన్ని, తోటివారిని అనారోగ్య సమస్యల నుండి కాపాడుకోవడమేనని, స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతు ప్రజారోగ్య కార్మికులు సుందర నగరం కోసం కష్ట పడుతున్నారని, వారికి మరింత భారం కాకుండా ప్రజలు తగిన సహకారం అందించాలన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఇంటిని ఇంత పరిశుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలను కూడా అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిఎంసి ఎస్.ఈ. శ్యాంసుందర్, సిటి ప్లానర్ రాంబాబు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓలు మధుసూదన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

1.25 లక్షల మందితో ప్రతిజ్ఞ

స్వచ్ఛత హి సేవాలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం తెల్లవారు జామున 5:30 గంటలకు ప్రజారోగ్య కార్మికుల మస్టర్ పాయింట్స్, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, వార్డు సచివాలయాల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత భాగ స్వామ్యంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞలో షుమారు 1.25 లక్షల మంది పాల్గొన్నారని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. జిఎంసి ప్రధాన కార్యాలయంలోనూ నగర కమిషనర్ అధ్యక్షతన ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

19న సైకిల్ డే.. : స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలలో భాగంగా గురువారం నిర్వహించే కమ్యూట్ ఆన్ సైకిల్ డే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కావున 19వ తేదీన ప్రజలు తమ రోజువారీ దినచర్యలో కేవలం సైకిల్ మాత్రమే వినియోగించాలని కోరారు. జిఎంసి అధికారులు, సిబ్బంది మోటార్ వాహనాలు కాకుండా సైకిల్ మీద మాత్రమే విధులకు హాజరవుతారన్నారు. వాతావరణ, శబ్ద, వాయు కాలుష్య నివారణ ఒకరోజు సైకిల్ వినియోగించాలని కోరారు.

మార్కెట్‌లోకి మహీంద్రా థార్ రాక్స్

ప్రజాశక్తి-గుంటూరు



థార్ రాక్స్‌తో పెమ్మసాని రవిశంకర్, చుక్కపల్లి రమేష్ తదితరులు

స్థానిక ఆటో నగర్‌లోని పయనీర్ ఆటో వరల్డ్ ప్రైవేటు లిమిటెడ్ షోరూంలో మంగళవారం సరికొత్త మహీంద్రా థార్ రాక్స్ కారును యూఎస్‌లో ఐటి కంపెనీ నిర్వాహకులు పెమ్మసాని రవిశంకర్, చిల్డ్రన్స్ స్పెషలిస్టు డాక్టర్ రఘురాంరెడ్డి, పయనీర్ గ్రూప్ ఛైర్మన్ చుక్కపల్లి రమేష్ సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని రవిశంకర్ మాట్లాడుతూ ఎస్‌యువి శ్రేణిలో ప్రవేశపెట్టిన థార్ రాక్స్ కారు పెట్రోలు, డీజిల్ వేరియంట్లలో లభిస్తుందన్నారు. 5 స్పీడ్ ఆటోమేటిక్, మాన్యువల్ ట్రాన్స్మిషన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ ఈ కారులో ఆరు ఎయిర్ బ్యాగ్స్, 360 డిగ్రీస్ సరౌండ్ వ్యూ సిస్టం, వైర్‌లెస్ ఛార్జింగ్ వంటి ఇతర అనేక ఫీచర్లతో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. కారు ఎక్స్‌షోరూం ప్రారంభ ధర రూ.12.99 లక్షలుగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ , సిఇఒ, ఇతర షోరూం సిబ్బంది పాల్గొన్నారు.